మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య

## ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ళ రాజేష్ రెడ్డి



విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 24 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు. మంగళవారం నాగర్ కర్నూల్ మండల పరిధిలోని వనపట్ల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు కూచుకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకి స్కూల్ బ్యాగ్స్‌ను ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి దంపతులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యను అందిస్తున్నారని, పాఠశాలలో మెరుగైన వసతులు కల్పిస్తున్నారన్నారు. సర్కారు బడిలో చదివే పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో చేరుకుంటారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు అనుభవం గల ఉపాధ్యాయులు ఉన్నారని, వారి దగ్గర విద్య అభ్యసిస్తే తాము అనుకున్న లక్ష్యాలను విద్యార్థులు చేరుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని నాయకులను, కార్యకర్తలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ కూచకుళ్ల సరిత, ఎంఈఓ భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు

# భాగస్వామ్యం కావాలి

### జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్





మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**మక్తల్ టౌన్, జూన్ 24 ప్రభాతవార్త:** మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాలలో భాగంగా మక్తల్ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాల మహమ్మారికి దూరంగా ఉంటూ, ఉజ్వల భవిష్యత్తు కొరకు బాటలు వేసుకోవాలని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ పిలుపునిచ్చారు. మక్తల్ పట్టణంలోని ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్ఎస్ బాయ్స్, అంబేద్కర్ నగర్ (ఐలిన్) స్కూల్‌లో ఏర్పాటు చేసిన మత్తు పదార్థాల నిర్మూలన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ విద్యార్థి దశ మీ జీవితానికి అత్యంత కీలకమైన పునాది. ఈ సమయంలో తెలియని ఆకర్షణలకు లోనై డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడితే మీ భవిష్యత్తు అంధకారమయమవుతుంది .ఇది కేవలం మీ ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, మీ కుటుంబాన్ని, మీ కలలను కూడా నాశనం చేస్తుంది. పోలీసులు మీ శ్రేయోభిలాషులు. ఎన్‌డిపిఎస్ యాక్ట్ చాలా కఠినమైనది, ఒకసారి ఈ కేసులో చిక్కుకుంటే జీవితాంతం దాని పర్యవసానాలు అనుభవించాల్సి వస్తుంది. కాబట్టి, మీరంతా చైతన్యవంతులై, మీ స్నేహితులను కూడా ఈ వ్యసనం వైపు వెళ్లకుండా కాపాడాలి" అని హితవు పలికారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా, గంజాయి దుష్ప్రభావాలను వివరించి అవగాహన కల్పించారు. విద్యార్థులు స్కూలు కాలేజీల వద్ద చాక్లెట్ రూపంలో మత్తు పదార్థాలను అమ్ముతున్నారని అలాంటి వాటికి దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు పోలీస్ శాఖ అహర్నిశలు శ్రమిస్తోందని, ఇందులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతిరోజూ వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజల చైతన్యం, సహకారంతోనే మత్తు పదార్థాలైన డ్రగ్స్, గంజాయిని పూర్తిగా నిర్మూలించగలమని, తద్వారా నేరరహిత సమాజాన్ని స్థాపించగలమని ఆయన గట్టిగా విశ్వాసం వ్యక్తం చేశారు. డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే విద్యార్థులు 1908 టోల్ ఫ్రీ నెంబర్ కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమాలలో మక్తల్ సీఐ రామ్ లాల్, ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్, ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి, అశోక్ బాబు, డివైఎస్ఓ వెంకటేష్, ఎంఈఓ అనిల్ గౌడ్, ప్రిన్స్ పాల్ రాములు, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం విజయవంతం చేయాలి

- నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు వేగవంతం చేయాలి
- పెండింగ్ డబుల్ బెడ్ రూం ఇండ్లను లబ్దిదారుల ద్వారా పూర్తి చేయాలి
- రైతులకు సమృద్ధిగా ఎరువుల సరఫరా
- లక్షా 25 వేల ఎకరాల ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణ లక్ష్యంగా చర్యలు

రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు

- ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎస్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు ..



మాట్లాడుతున్న సిఎస్ కె.రామకృష్ణారావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 24 ప్రభాతవార్త :** ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె. రామ కృష్ణా రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సి.ఎస్ కె.రామ కృష్ణా రావు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్ నుంచి అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్‌లు విజయేందిర బోయి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. వన మహోత్సవం కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్లు, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాలపై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ, 2 లక్షల 30 వేలకుపైగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని, లక్షకు పైగా ఇండ్ల నిర్మాణ పనులు గ్రౌండ్ అయ్యాయని అన్నారు. పెద్ద వర్షాలు కురవడానికి ముందే మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగేలా చూడాలని సీఎస్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తూ సీనరేజి చార్జిలను ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులు లబ్ధిదారులు పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ప్రస్తుతం ఎంత మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగిందో ఎంబీ రికార్డులను నమోదు చేసి లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని, ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుందని అన్నారు. పిఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 క్రింద మనకు లక్షా 13 వేల ఇండ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి పట్టణం నుంచి కనీసం 500 మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్‌లకు సీఎస్ సూచించారు.ప్రతిజిల్లాలో ఎరువుల లభ్యత స్టాక్‌పై రివ్యూ పెట్టాలని అన్నారు. జూలై వరకు అవసరమైన స్టాక్ ప్రస్తుతం అందుబాటులో ఉందని, సెప్టెంబర్ నాటికి అవసరమైన ఎరువుల స్టాక్ ప్రోక్యూర్ చేస్తున్నామని అన్నారు. ఎరువుల స్టాక్ ను ప్రత్యేక అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. లక్షా 25 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు ప్రస్తుత సంవత్సరం విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రైతులకు లాభసాటి పంట ఆయిల్ పామ్ పట్ల అవగాహన కల్పిస్తూ పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు.భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా దాదాపు 8 లక్షల 27 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని సాధా బైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టాలో కరెక్షన్స్ వంటి వివిధ సమస్యల పై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఈ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. డెంగ్యూ, మల్లేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు జిల్లాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలని, కలెక్టర్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణ పై అవగాహన కల్పన, పర్యవేక్షణ వంటి పలు కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వల్నరబుల్ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి లక్షణాలు గల ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి అవసరమైన చికిత్స అందించాలని అన్నారు. ఆన్ లైన్ నుంచి వీసి లో పాల్గొన్న అటవీ, పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ మాట్లాడుతూ, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని అన్నారు. గతంకంటే మెరుగ్గా ప్రజల్లో వన మహోత్సవం కార్యక్రమం తీసుకుని వెళ్ళాలని, ప్రతి రోజూ ఒక్కో శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వసించాలని అన్నారు. జిల్లాలో వి.ఐ.పి పర్యటనల సందర్భంగా తప్పనిసరిగా మొక్కలు నాటేలా చూడాలని అన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పరిధిలో ఎత్తైన మొక్కలు నాటి వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.అటవీ ప్రాంతంలో కోతులకు అవసరమైన పండ్ల మొక్కలను పెద్ద ఎత్తున బ్లాక్ ప్లాంటేషన్ పెంచాలని అన్నారు. జిల్లాలకు కేటాయించిన వన మహోత్సవం లక్ష్యాలను కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ జిల్లాలో భూ భారతి రెవెన్యూ సదస్సుల ద్వారా 10203 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఇందులో 3276 దరఖాస్తులు ఆన్ లైన్ చేయడం జరిగిందని తెలిపారు. భూ భారతి రెవెన్యూ సదస్సులు ద్వారా భూ సమస్యల దరఖాస్తులు ఆగస్టు 15 లోగా పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డెంగ్యూ కేసులు ప్రబలకుండా పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గత సంవత్సరం 28 కేసులు రిపోర్ట్ కాగా ఈ సంవత్సరం 49 డెంగ్యూ కేసులు రిపోర్ట్ అయినట్లు తెలిపారు.హై రిస్క్ ఏరియా లలో ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు 100 రోజుల వారీగా కార్యాచరణ రూపొందించినట్లు, మున్సిపాలిటీ లు,పంచాయతీలలో పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మున్సిపాలిటీ, పంచాయతీ, వైద్య శాఖలు సమన్వయంతో సీజనల్ వ్యాధులు నియంత్రణకు ముందు జాగ్రత్త గా ఓపెన్ ప్లాట్ లలో చెత్త తొలగించడం,డ్రైన్ లు క్లీన్ చేయడం,నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి నివారణ 100 రోజుల కార్యక్రమం 2024 డిసెంబర్ 7 నుంచి 2025 మార్చి 24 వరకు (మొదటి దశ) పైలెట్ జిల్లాలలో బాగంగా జిల్లాలో 65788 మంది టి.బి.సోకే అవకాశం ఉన్న రోగులను స్క్రీనింగ్ చేసినట్లు తెలిపారు. వీరిలో 10549 మందికి క్షయ నిర్ధారణ తెమడ పరీక్షలు,4183 మందికి హ్యాండ్ హోల్డ్ పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా చాతీ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించినట్లు తెలిపారు. టి.బి ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా రెండవ దశలో జూన్ 2 నుంచి ప్రారంభించి 1,93,108 లక్ష్యంగా స్క్రీనింగ్ చేయాలని నిర్ణయించగా 13658 టి.బి.సోకే అవకాశం ఉన్న వారిని స్క్రీనింగ్ చేసి 11609 మందికి తేమడ పరీక్షలు,3415 మందికి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.ఇందులో 568 కి టిబి నిర్ధారణ చేసి 561 మందికి నిక్షయ్ పోషన్ కిట్‌లు అంద చేసినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్, డిఆర్‌డిఓ నర్సింహులు,జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా .కె.కృష్ణ, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా.మల్లికార్జున్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### బాలానగర్ పోలీస్ స్టేషన్

# తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ జానకి

**బాలానగర్, జూన్ 24 ప్రభాతవార్త :** వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ సిబ్బంది విధులు, రికార్డులు, పరిసరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సిబ్బంది సేవలపై ఏవైనా సమస్యలు ఉంటే తాము పరిశీలిస్తామని, విధుల విభజన ప్రకారం సమర్థవంతంగా సేవలందించాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ఫిర్యాదుదారులందరికీ సమానంగా సేవలందించాలని, స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడుతూ అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా, ఇతర – మిగతా4లో..

# వైద్య సేవలపై కలెక్టర్ దృష్టి

- ప్రభుత్వాసుపత్రిలో మౌళిక వసతులను సమీక్ష చేసిన కలెక్టర్
- వైద్యుల హాజరు, రికార్డుల పరిశీలన
- ఆపరేషన్ థియేటర్ల మరమ్మతులకు నిధులు, ఆసుపత్రిలో అందుతున్న ఆహారం
- ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసిన నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



ఆసుపత్రిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 24 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వైద్యులు, సిబ్బంది సమయానికి వస్తున్నారా..లేదా అని ఆరా తీశారు. ఆసుపత్రిలోని ఐసీయూ,ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ గదులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య స్థితులను తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని వార్డులో వివిధ రకాల రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇతర వ్యాధిగ్రస్తులకు మహిళలు, శిశువులకు అందించే చికిత్సలపై కూడా ఆరా తీశారు. జనరల్ వార్డ్, ఎక్స్ రే రూమ్, ప్రయోగశాలను పరిశీలించారు. ప్రతిరోజు ఎన్ని నమూనాలను సేకరించి రిజిస్టర్‌లలో నమోదు చేస్తున్నారో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అక్కడ నుండి ఫార్మసీ కేంద్రాన్ని పరిశీలించి పేషెంట్లకు ఇస్తున్న మందులను పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలను రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎన్ని రకాల వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అందుబాటులో ఉన్న వ్యాక్సిన్ వివరాలను సేకరించారు. డయాలసిస్ యూనిట్‌ను పరిశీలించి రోజుకు ఎంతమంది పేషెంట్లకు డయాలసిస్ చేస్తున్నారో సూపరింటెండెంట్ డాక్టర్ రఘును అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్లను వినియోగంలోకి తీసుకురావడానికి కావలసిన మరమత్తులకు కావలసిన నిధులను తక్షణమే మంజూరు చేస్తామని వెంటనే మరమ్మతులు పూర్తి చేసి మూడు ఆపరేషన్ థియేటర్లను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో కావలసిన అన్ని మౌళిక వసతులను కల్పిస్తామని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. బ్లడ్ బ్యాంక్ సేవలపై కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. బ్లడ్ బ్యాంక్ అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు నిధులను మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రి రోగులకు అందించే ఆహారం సరఫరా చేసే క్యాంటీన్ ఏర్పాటు స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు.ఆసుపత్రిలో రూములు తిరుగుతూ అక్కడ చికిత్స పొందుతున్న రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆసుపత్రిలో పలు రికార్డులను పరిశీలించి, వైద్యాధికారులకు కలెక్టర్ బాదావత్ సంతోష్ పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో రోగుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో మౌళిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళికను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో మెరుపైన సేవలకు వైద్యులతో ఒక ప్రత్యేక సమావేశాన్ని త్వరలోనే నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రఘు, ఇతర వైద్యులు తదితరులు ఉన్నారు.

# రైతును రాజు చేయడమే లక్ష్యం

- గతంలో వరి వేస్తే వరి అంటే..మేం సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చాం
- నేడు దేశంలోనే వరి ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్
- రైతు సంబరాల్లో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 24 ప్రభాతవార్త:** వ్యవసాయాన్ని పండగ చేసి రైతును రాజును చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. చెప్పిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను 70 లక్షల మంది రైతుల ఖాతాలలో జమ చేసిన సందర్భంగా మంగళవారం హైదరాబాదులోని సెక్రటేరియట్ వద్ద నిర్వహించిన రైతు విజయోత్సవ సంబరాలలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల ప్రయోజనార్థం ప్రత్యక్ష ప్రసారం చేయగా మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్ల రైతు వేదికలో జిల్లాకలెక్టర్ విజయేందిర బోయి,దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూధన్ రెడ్డి హాజరయ్యారు. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో గత ప్రభుత్వం ఎగ్గొట్టిన 7,625 కోట్ల రైతు బంధు నిధులను తాము అధికారంలోకి వచ్చిన తరువాత చెల్లించామన్నారు. చెప్పిన విధంగానే మొదటి సంవత్సరంలోనే 21వేల కోట్లరూపాయలు రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేసి 2024 ఆగస్టు 15న రైతులను రుణ విముక్తులను చేసామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి వేసుకున్నట్లు అని వరిని కోనం అని తెగేసి చెప్పారని, అయితే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వరిని కొంటామని చెప్పడమే కాకుండా, సన్నధాన్యానికి 500 రూపాయలు బోనస్ ఇచ్చామని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం వరి పండించడంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, రెండు కోట్ల 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించామని, ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల లోనే డబ్బులు చెల్లించామని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని క్యాన్సర్ పేషెంట్ లా అప్పగిస్తే అలాంటి పరిస్థితి నుండి రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా తీసుకెళ్తున్నామని,గత ప్రభుత్వం రైతుల పేరుపై అప్పు చేయడమేకాక, భూములను అమ్మడం, లక్ష కోట్ల రూపాయలు కాళేశ్వరంపై ఖర్చు చేసి గత ముఖ్యమంత్రి కేసీఆర్,కెటిఆర్‌లు ఆగర్భ శ్రీమంతులు కాగా ప్రజలు దరిద్రులు అయ్యారని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగాల కోసం ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వలేదని, తాము అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని, రైతులకు –మిగతా4లో..

# ఖాతాదారులకు సురక్ష యోజన భీమాపై అవగాహన కల్పించాలి



బ్యాంకర్లతో సమీక్ష సమావేశమైన జిల్లా కలెక్టర్

**వనపర్తి, జూన్ 24 ప్రభాతవార్త :** 2025, 26 ఆర్థిక సంవత్సరానికి వనపర్తి జిల్లాలో రూ. 5290.33 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రకటించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల సమన్వయ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రూ. 5290.33 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను ప్రకట్టించారు. ఇది గత సంవత్సరం కంటే 928.67 కోట్లు అధికం. ఇందులో అత్యధికంగా రూ. 3982.31 కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించినట్లు తెలియజేశారు. యంఎస్‌యం. ఈ కింద రూ.429.50 కోట్లు ప్రయారిటీ సెక్టార్ కింద విద్య, గృహ నిర్మాణానికి రూ. 193.77 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అతి తక్కువ డబ్బులతో అత్యధికంగా లబ్ది చేకూరే ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన బీమాను జిల్లాలోని బ్యాంక్ ఖాతాలు ఉన్న ప్రతి ఒక్కరికి చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బ్యాంకర్లను ఆదేశించారు. బ్యాంకర్లు సాధించిన లక్ష్యాల సమీక్ష సందర్భంగా జిల్లాలో ఆయా బ్యాంకులు చేసిన పి.యంజెజెబివై, పియంఎస్‌బివై బీమా పాలసీలపై కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష యోజన భీమా చేయించడానికి చెల్లించాల్సిన డబ్బులు సంవత్సరానికి కేవలం 20 రూపాయాలు మాత్రమే అని అదే ప్రధాన మంత్రి జీవన్ జ్యోతికి అయితే కేవలం 436 రూపాయలు కట్టడం వల్ల ప్రమాదవశాత్తూ ఏమైనా జరిగితే ఒక్కో భీమా పాలసీ నుండి 2 లక్షల రూపాయలు చొప్పున వస్తాయన్నారు. కానీ బ్యాంకర్ల నిర్లక్ష్యం వల్ల ఖాతాదారులకు భీమా చేయించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాతాదారులకు బ్యాంకర్లు అవగాహన కల్పించాలని, సంవత్సరానికి 20 రూపాయలు, 436 పెద్ద విషయం కాదన్నారు. జిల్లాలో 381786 ఖాతా దారులు ఉంటే పి.యంజెజెబివై కింద భీమా చేయించిన వారు కేవలం 78,607 మాత్రమే ఉన్నారని అందులోనూ రెన్యువల్ చేయించుకున్న వారు 62913 ఖాతాదారులు అని తెలిపారు. అదే పియంఎస్‌బివై లో 199,995 మంది భీమా చేయించుకున్నారు. వచ్చే సమావేశం వరకు భీమా చేసిన వారి సంఖ్య గణనీయంగా పెరగాలని లేకుంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అదేవిధంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి చేసుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి రైతులకు రుణాలు ఉదారంగా ఇవ్వాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, డిప్యూటీ రీజినల్ అధికారి మురళి కృష్ణ, చీఫ్ మేనేజర్ లోకేష్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకుమార్, డిఆర్డీఓ పిడి ఉమాదేవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ దేవాలయ నిర్మాణానికి విరాళం

**ఆత్మకూర్ జూన్ 24, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో నూతనంగా నిర్మించనున్న పెద్దమ్మతల్లి దేవాలయ నిర్మాణానికి ఆత్మకూర్ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో 4 లక్షల రూపాయల విరాళాన్ని కమిటీ చైర్మన్ మొగిలి శ్రీధర్ గౌడ్ కు అందజేశారు ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ జూన్ నెల మొదటి వారంలో పట్టణంలో గ్రామదేవతల పున ప్రతిష్టతో పాటుగా బొడ్రాళ్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహించిన నేపథ్యంలో ఆత్మకూరు పట్టణంలో నూతనంగా పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి వివిధ కుల సంఘాలు ఆర్థిక సహకారం చేస్తున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని దేవాలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులైన శ్రీధర్ గౌడ్ గారికి కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో నాలుగు లక్షల రూపాయల విరాళాన్ని అందజేయడంతో పాటుగా తమవంతుగా చేయూతనిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మాజీ మున్సిపల్ చైర్మన్ గాయత్రి రవి కుమార్ యాదవ్ యాదవ సంఘం నాయకులు అరుణ్ కుమార్ శివానంద్ తదితరులతో పాటుగా దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి నాలుగు లక్షల విరాళం అందజేస్తున్న దృశ్యం

## ఇరాన్‌పై అమెరికా యుద్ధం ఆపాలి

**ఆత్మకూర్ జూన్ 24, ప్రభాతవార్త :** సిపిఐ ఎంఎల్ మాస్ లైన్. నేతల వెల్లడి... ప్రపంచవ్యాప్తంగా యుద్ధమేఘాలు కొమ్ముకుంటున్న తరుణంలో ఇరాన్‌పై అక్రమంగా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధానికి తోడుగా అమెరికా ఇజ్రాయిల్‌కు మద్దతుగా కథనరంగంలో దూకడం తక్షణమే నిలిపివేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ వనపర్తి జిల్లా కార్యదర్శి హనుమంతు టియుసిఐ నాయకులు ప్రసాద్ తదితరులు విజ్ఞప్తి చేశారు ఈ మేరకు మంగళవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఇరాన్ పై అమెరికా పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రపంచంలో శాంతి కరువైందని ప్రపంచ పోలీసు పాత్ర పోషిస్తూ ఇతర దేశాలలో ఉన్న ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు అమెరికా తహతహలారడం సామ్రాజ్యవాధానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఇరాన్ మరియు ఇజ్రాయిల్ దేశాలలో ఉన్నటువంటి భారతీయ పౌరులను తక్షణమే రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అంతేకాకుండా ఇరాన్‌పై అక్రమంగా యుద్ధానికి దిగిన ఇజ్రాయిల్ వంటి దేశాలను నిలవరించినందుకు తమ వంతు పాత్ర పోషించాలని వారు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు వెంకటయ్య రాజు తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.



సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

## పాఠ్య పుస్తకాలు సకాలంలో అందించాలి

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం డి కుతుబ్**

**అమరచింత జూన్ 24, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించి విద్యార్థుల చదువుకు ప్రభుత్వ అధికారులు ఏర్పాటు అందించాలని ఏఐవైఎఫ్ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన అమరచింత మండలంలోని కొంకనివాని పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రారంభమై 13 రోజులు గడుస్తున్న పుస్తకాలు అందలేదని విద్యార్థులు ఆరోపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదవిద్యార్థులు చదివే ప్రభుత్వపాఠశాలకు పుస్తకాలు సకాలంలో అందించకపోతే వారి విద్య ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలలు ఇబ్బడి ముబ్బడిగా పేదలను దోచుకుంటున్నాయని సకాలంలో పుస్తకాలు అందకపోతే వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి కొంకన్వాని పల్లి గ్రామానికి పాఠ్యపుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వంశీ, భాను, శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్

## కస్తూర్బా గాంధీ విద్యాలయంలో న్యాయబద్ధంగా అడ్మిషన్లు నిర్వహించాలి

**అమరచింత జూన్ 24, ప్రభాతవార్త:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉపాధ్యాయులు విద్యార్థుల అడ్మిషన్లు న్యాయబద్ధంగా తీసుకోవడం లేదని రాజకీయ నాయకుల పైరవీలకు అడ్మిషన్లు ఇస్తున్నారని ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు, రాఘవ అన్నారు. మంగళవారం అమరచింత మండలంలోని పామిరెడ్డి పల్లె శివారులో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థిలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, కె.రాఘవ మాట్లాడుతూ, కస్తూర్బా బాలికలవిద్యాలయంలో తల్లిదండ్రులు కోల్పోయిన విద్యార్థులకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అడ్మిషన్లు ఇవ్వాలని నిబంధన ఉన్న ఉపాధ్యాయులు ఏకపక్షంగా అడ్మిషన్లు ఇస్తున్నారని ఆయన అన్నారు. అలాగే కేజీబీవీలో ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు అడ్మిషన్లు కొనసాగుతున్న పేద విద్యార్థులకు అడ్మిషన్లు లేక సుదూర ప్రాంతాలకు వెళుతున్నారని ఇప్పటికైనా కేజీబీవీలో న్యాయబద్ధంగా అడ్మిషన్లు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే కేజీబీవీ విద్యార్థినిలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేజీబీవీలో నెలకొల సమస్యలను పరిష్కరించాలని లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భాను ప్రకాష్, ప్రణయ్, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాఘవ

## శాంతి భద్రత పరిరక్షణకై రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాత్

**అమరచింత జూన్ 24, ప్రభాతవార్త:** శాంతి భద్రత పరిరక్షణకై రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవర్ నిర్వహిస్తున్నామని ఆత్మకూరు సిఐ శివకుమార్, ఎస్సై, సురేష్ అన్నారు. మంగళవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసుల ఆధ్వర్యంలో సంయుక్తంగా రాజీవ్ గాంధీ, తహసిల్దార్ మెయిన్ రోడ్, కుమ్మరి వీధి, భగత్ సింగ్ నగర్, బస్టాండ్ వరకు కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శివకుమార్ మాట్లాడుతూ, గ్రామాలతోపాటు పట్టణాలలో మత ఘర్ష న, రాజకీయ కలహాలు జరిగినప్పుడు రాపిడ్ యాక్షన్ ఫోర్స్ అత్యవసర పరిస్థితుల్లో సహాయపడతారని ఆయన అన్నారు. మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా కలిసిమెలిసి ఉండాలని ఆయన కోరారు. అలాగే వచ్చే ఎన్నికలలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని ఆయన వివిధ రాజకీయ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ తోపాటు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



అమరచింతలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాత్

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**నారాయణపేట, జూన్ 24 ప్రభాత వార్త :** పంచాయతీ కార్మికులను కనీస వేతనం 26,000 అమలు చేయాలి. జూలై 9న దేశవ్యాప్తంగా లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కనీస వేతనాలు 26వేలు అమలు చేయాలని, నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ జరిగే సమ్మెను జయప్రదం చేయుటలో భాగంగా ఉట్కూరు మండ ల పరిధిలోని పులిమామిడి గ్రామపంచాయతీ కార్యదర్శి రవికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మికులు అంజప్ప, వెంకటప్ప, సంజీవ్, రాములు, ఎస్.వెంకటప్ప, కుమ్మరి లింగప్ప, హనుమంతు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న దృశ్యం

### కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా..

# రైతు భరోసా సంబరాల పండుగ

**మక్తల్ టౌన్, జూన్ 24 ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా డబ్బులను గత సోమవారం నుంచి అకౌంట్లలో జమ చేస్తోంది. ఇవాళ ఏకంగా 15 ఎకరాల వరకూ ఉన్న రైతులకు డబ్బు జమ చేసింది. అందువల్ల 15 ఎకరాలు ఉన్న రైతులకు ఎకరానికి 6వేల చొప్పున 9 రోజుల్లో మొత్తం రూ.9 వేల కోట్లు ను రైతుల అకౌంట్లో జమ చేయడం జరిగింది, గత సోమవారం ఈ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినారు. దేశంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రైతులకు రూ. 70 వేల కోట్లు రుణమాఫీ జరిగింది. తెలంగాణలో ఇప్పుడు 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ కింద రూ. 21 వేల కోట్లు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చెల్లించింది. తొలకరికి ముందే రైతులకు పెట్టుబడి సాయం అందించిన తొలి ప్రభుత్వం గా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిలిచింది. ప్రజా ప్రభుత్వం గౌరవ శ్రీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిది దని రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని మరోసారి చాటి చెప్పిన ఘనత రేవంతన్న సర్కార్‌దని అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమానికి నాంది పలికి తెలంగాణ రైతాంగానికి రైతు భరోసాతో పాటు యావత్ కాంగ్రెస్ కుటుంబానికి నైతిక భరోసాను కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, పశుసంవర్ధక శాఖ మాత్యులు డా. వాకిటి శ్రీహరికి రైతుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తూ అంబేద్కర్ చౌరస్తాలో బాణాసంచా కాలుస్తూ రైతులతో కలిసి రైతు సంబరాలు నిర్వహించడం జరిగింది. మక్తల్ మున్సిపల్ టౌన్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రైతులతో కలిసి పెద్ద ఎత్తున రైతు సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎ.రవికుమార్, గొలపల్లి నారాయణ, కట్టా సురేష్, గోవర్ధన్, రహీమ్ పటేల్, అశోక్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

### ఉప్పునుంతలలో ఘనంగా రైతు భరోసా సంబరాలు

**ఉప్పునుంతల, జూన్ 24 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవల రైతులకు తొమ్మిది రోజుల్లోనే 9 వేల కోట్ల రూపాయలను రైతు భరోసా కింద రైతుల ఖాతాలో జమ చేశారు. రైతు భరోసా కింద నిధులు విడుదల చేసి రాష్ట్ర చరిత్రలో నిలిచి పోయారని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో రైతు భరోసా సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షులు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంబరాలకు పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతి రైతుకు ఎకరాకు 12 వేల చొప్పున రైతు భరోసా కింద రాష్ట్రంలో 1.49 కోట్ల ఎకరాలకు నిధులు కేటాయించడం జరిగిందని, 2 వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 2 లక్షలలోపు కలిగిన రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 6 కిలోల చొప్పున సన్న బియ్యంతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని వారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగ పరచుకొని ప్రభుత్వం పట్ల ప్రజల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని వారు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేయడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు చేరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ, జిల్లా రైస్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షులు అనంత ప్రతాప్ రెడ్డి, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ వెల్టూర్ రేణయ్య, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు తిప్పర్తి జగన్మోహన్ రెడ్డి, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ లక్ష్మయ్య, కర్నాటి సత్యం, కొత్త అచ్చుతారెడ్డి, సూరం ప్రశాంత్ రెడ్డి, పాతుకుల రామచంద్రయ్య, మేడమోని భాస్కర్, సిహెచ్ తిరుపతయ్య, దొంతు మల్లయ్య, మండలంలోని వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఉప్పునుంతలలో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

## నా పాఠశాల విద్యార్థులకు, నా మిత్రుల సహాయం వెలకట్టలేనిది

**గడ్డంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదన్మోహన్**

**మక్తల్‌టౌన్, జూన్24 ప్రభాతవార్త:** మక్తల్‌మండలం గడ్డంపల్లి ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్, బ్యాగ్స్, టై, బెల్టు పెన్స్, పెన్సిల్స్ మొదలైనవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదన్మోహన్ మిత్రులైన సతీష్, గణేష్, రాజు, శ్రీకాంత్, వెంకటేష్, మహేందర్, జనార్దన్ రెడ్డి, మల్లేష్‌యాదవ్, ప్రశాంత్, తిరుపతిలచే విద్యార్థిని విద్యార్థులకు గ్రామ పెద్దలు గడ్డంపల్లి మాజీ సర్పంచ్ జ్ఞానేశ్వర్, గ్రామ సెక్రెటరీ లింగేశ్వర్, అంగన్‌వాడి టీచర్ నాగమ్మ, గ్రామ యువకులు సతీశ్, శీను, శ్రీహరిల సమక్షంలో వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మాజీ సర్పంచ్ గ్రామ పెద్దలు మాట్లాడుతూ మారుమూల గ్రామమైన గడ్డంపల్లిలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న పేద విద్యార్థులకు తమవంతుగా ఏదైనా సహాయంచేయాలి అనేమంచి తలంపుతో ముందుకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడు మదన్ మోహన్ మిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మంచి మనసుతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఏ రూపంలోనైనా సహాయ సహకారాలు అందించడానికి వచ్చే దాతలకు భగవంతుడు అంతా మంచే చేస్తాడు అని ఈ సందర్భంగా వాళ్ళు అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదన్మోహన్ మాట్లాడుతూ తన మిత్ర బృందానికి తన తరపున గ్రామ పెద్దల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశాడు. ముమ్ముందు ఇలాంటి మంచి ఆలోచనలతో నా మిత్ర బృందం మంచి పనులు చేయడానికి ముందుండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమ కేంద్ర బిందువైన దాతలు మాట్లాడుతూ మా ప్రాణ మిత్రుడు మదన్మోహన్ పనిచేస్తున్న ప్రాథమిక పాఠశాల గడ్డంపల్లి కు తమ వంతుగా సహాయం అందించడానికి అవకాశం కల్పించిన మిత్రునికి కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇంకా ఏమైనా అవసరాలు ఉన్న తమ వంతుగా తమ శాయశక్తుల సహాయం అందించడానికి ముందుంటామని తెలియజేశారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తుల సమక్షంలో దాతలను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

## సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

**ఎంజెపి రెసిడెన్షియల్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు డా. స్వప్న**

**ఉప్పునుంతల, జూన్ 24 ప్రభాతవార్త :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పునుంతల వైద్యాధికారిణి డా. స్వప్న ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వెల్టూరు మహాత్మ జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల ప్రాంతం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంటువ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ఎక్కువ దోమల బెడద ఉంటుందని, దీంతో డెంగీ, మలేరియా, మెదడు వాపులు లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని, విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్య అధికారిని సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా కొంతమందికి సాధారణ జలుబు, మరికొంతమంది విద్యార్థులు దగ్గు జ్వరంతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైద్యాధికారిణి డా. స్వప్నతోపాటు ఎంపిహెచ్ ఓ మధునాయక్, హెల్త్ అసిస్టెంట్ జగదీష్, ఎంఎల్ హెచ్‌పి నవ్య, ఏఎన్ఎం జ్యోతి, జయశీల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వెల్టూర్ ఎంజెపి రెసిడెన్షియల్ విద్యార్థినులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారిణి డా. స్వప్న

## ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు వేసిన దృశ్యం

**దామరగిద్ద, జూన్ 24 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల పరిధిలోని పిడెంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేయడం జరిగింది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు రేణమ్మ ఇంటి దగ్గర డిఈ హరికృష్ణ ముగ్గు వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంధుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్‌లు ప్రారంభం : ప్రిన్సిపాల్

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులు, వయోవృద్ధులు ట్రాన్స్ జెండర్స్ వ్యక్తుల సాధికారత శాఖ అద్వర్యంలో నడపబడుతున్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల కళాశాలలో 2025,26 సంవత్సరానికి గాను 1 వ తరగతి నుండి ఇంటర్మిడియట్ వరకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు ప్రిన్సిపాల్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 సం.ల నుండి 14 సం . వరకు వయస్సు ఉండి 40శాతం అంధత్వము కలిగి సర్టిఫికెట్‌ను కలిగిన అంధులైన విద్యార్థిని విద్యార్థులు వారి వయస్సును బట్టి పాఠశాల కళాశాల వివిధ తరగతులలో చేరుటకు సీట్లు ఖాళీలు ఉన్నాయని దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ పాఠశాలలో చదువుచున్న అంధులైన విద్యార్థిని విద్యార్థులకు ఉచిత వసతి ఉచిత భోజనము ఒక్కొక్క విద్యార్థికి 4 జతల బట్టలు, ప్రభుత్వము సమకూర్చి అన్నీ వసతులు ఉచితముగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మహబూబ్ నగర్ పిల్లలమర్రి రోడ్ అంధుల ఆశ్రమ పాఠశాల / కళాశాల ప్రిన్సిపాల్‌ను నందు స్వయంగా గాని, ఫోన్ నెంబర్ 9618243794 ద్వారాగాని సంప్రదించవలసిందిగా సూచించారు.

## ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే జరిమానా

**మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్**

**కల్వకుర్తి, జూన్ 24 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటీలో చిరు వ్యాపారాలు నిర్వహించే లబ్దిదారులు మున్సిపల్ కార్యాలయం నుంచి తప్పకుండా ట్రేడ్ లైసెన్స్ పొందాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్ తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా పట్టణ పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తే వారికి జరిమానాలు విధించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని విద్యాశాలి ఎడ్యుకేషనల్ ఇన్ఫ్రా డెవలప్మెంట్ వారు ట్రేడ్ లైసెన్స్ కొరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారు, కానీ వారి వ్యాపారంకు సంబంధించి వివరాలు అనగా కమర్షియల్ షాపు డాక్యుమెంట్, ఆస్తి పన్ను చెల్లించిన రసీదు వంటివి లేకుండా, రెసిడెన్షియల్ సముదాయంలో వ్యాపారం చేసుకుంటు, నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఇన్స్టెంట్ ట్రేడ్ లైసెన్స్ తీసుకున్నారు. ఇట్టి విషయంలో మున్సిపల్ సిబ్బంది ట్రేడ్ లైసెన్స్ వెరిఫికేషన్‌లో భాగంగా వారి షాపుకు వెళ్లి విచారించగా అట్టి లైసెన్స్‌కు అనుమతి లేదని వెంటనే రూ.20 వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీలో ఉన్న వ్యాపారస్తులందరూ తాము ట్రేడ్ లైసెన్స్‌ను మున్సిపాలిటి ద్వారా పొంది వ్యాపారం చేసుకోవాలని కమిషన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.



జరిమానా రసీదును అందజేస్తున్న మున్సిపల్ అధికారులు

## ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలి : సిపిఐ



ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

**మద్దూర్, జూన్ 24 ప్రభాతవార్త:** నారాయణ పేట్ జిల్లా, మద్దూర్ మండల్ కేంద్రములో సిపిఐ ఎమ్మెల్ మాస్ లైన్ సబ్ డివిజన్ కమిటి ఆధ్వర్యములో, ఇరాన్ పైన అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్నటువంటి యుద్ధ దాడులను ఆపాలి అమెరికా ఆధిపత్యము కోసము ఇరాన్‌లో ఉన్న ఆదేశాల సంపదను దోచుకోవడానికి, తన పీతండారి విధానాన్ని కొనసాగింపుగా ఇట్లాంటి దాడులకు పునుకుంటుంది కావున యుద్ధం ఆపాలని మద్దూర్ పాత బస్టాండులో మంగళవారం నిరసన చేసిన అనంతరం ట్రంప్ దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ సబ్ డివిజన్ కార్యదర్శి కొండా నర్సిములు, డిఎల్‌సి నాయకులు బి. నారాయణ, ఎఐపికెఎంఎస్ మండల అధ్యక్షులు అంబటి నర్సిములు, పివైఎల్ నాయకులు వై. అంజి, విజయ్, పిడిఎస్‌యు, ఆంజనేయులు ఎఐయుకెఎస్, లాలు పివైఎల్ హన్మప్ప, హసీన్, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మున్నూరు కాపు ఉపాధ్యక్షుడిగా జొన్నల సుభాష్ నియామకం



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట, జూన్ 24 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రానికి చెందిన జొన్నలు సురేందర్ రెడ్డిని మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ మున్నూరు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జొన్నల సురేందర్‌రెడ్డి నియమించారు. మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శిగా జి.బసిరెడ్డి, మున్నూరు కాపుస్పోక్ పర్సన దండు జనార్దన్ రెడ్డిని ఎన్నుకున్న శుభ సందర్భంగా నారాయణపేట జిల్లా మున్నూరు కాపు అధ్యక్షులు బండి శివరాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుతారి సత్య రఘుపాల్ రెడ్డికి, నారాయణపేట జిల్లా మున్నూరు కాపు సోదరులకు ధన్యవాదాలు తెలుపుతూ కాపుల ఐక్యత కోసం పోరాడుతూ రాజకీయంగా ఆర్థికంగా మున్నూరు కాపులను ముందుకు తీసుకెళ్తానని తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోసిన సింగిల్ విండో చైర్మన్ నరసింహ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

**మద్దూర్, జూన్ 24 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో మంగళవారం సింగిల్ విండో చైర్మన్ నరసింహ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు 60 గజాల వరకు కట్టుకోవాలని లబ్ధిదారులకు ఆయన తెలియజేశారు. రెండో విడతల కూడా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మద్దూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మాజీ ఎంపీపీ సంజీవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుక్కల బాలరాజ్, చిన్న మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు స్కూళ్ళలో అధిక ధరలకు పుస్తకాల విక్రయాలు



పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేస్తున్న విద్యాధికారి



పట్టుబడిన పుస్తకాలను చూపిస్తున్న కురువ పల్లయ్య

**ఇటిక్యాల, జూన్ 24, ప్రభాతవార్త:** పట్టణంలో కొన్ని ప్రైవేట్ స్కూళ్ళలో పుస్తకాలను అధిక ధరలకు అమ్ముతున్నారని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కో కన్వీనర్ కురువ పల్లయ్య ఆరోపించారు. పాఠశాల యాజమాన్యం, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు 10 వేల నుంచి 12 వేల దాకా ఎక్కువ ధరకు అమ్ముతూ వుండగా కురువ పల్లయ్య కు పట్టుబడ్డారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఒక ప్రైవేట్ స్థలాల్లో ఒక ఇల్లును అద్దెకి తీసుకొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, శ్రీ చైతన్య లోగో ఉన్న బెల్టులు, టైలు, ఎక్కువ ధరకు అమ్ముతుండగా కురువపల్లయ్య పట్టుకొని సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారి కి సమాచారం తెలిపారు. మండల విద్యాధికారి శ్రీనివాసరావు గౌడ్, వారి సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా 6,7 ,8, 9, 10 తరగతిలకు ప్రభుత్వ ద్వారా వచ్చే పాఠ్యపుస్తకాలనే వాడాలని, అలాంటివి ఇక్కడ ఏమి లేకుండా తమ సొంత సిలబస్ ఉన్న పాఠ్య పుస్తకాలను అమ్ముతున్నారని, ఇది ప్రభుత్వానికి విరుద్ధమని వెంటనే ఆ పుస్తకాలు అమ్మే బుక్ స్టాల్‌ను సీజ్ చేశారు.

## అంబరాన్ని అంటిన రైతు సంబరం

**పెబ్బేరు, జూన్ 24 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల కేంద్రంలో టీపీసీసీ గాంధీభవన్, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు, పెబ్బేరు పట్టణ,మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు సంబరాలు అంబరాన్ని అంటెల బాణ సంచా కాల్చి, క్షీరాభిషేకం చేసి, స్వీట్ లు పంచుకుని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా రైతు భరోసా కింద రైతుల ఖాతాలో 9 రోజుల్లో 9వేల కోట్ల పైచిలుకు వేసి చరిత్ర తిరగరాసారని రాష్ట్రంలో 1కోటి 49 లక్షల 39వేల పైగా ఎకరాలకు రైతు భరోసా నిధులు విడుదల చేశామన్నారు. ఈ నెల 16 వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి ఈ రోజు 24వ తేదీ వరకు ఎకరాలు సంబంధం లేకుండా రైతుల ఖాతాలో డబ్బులు జమచేశామని హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమం లో మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, విజయ వర్ధన్ రెడ్డి, పెబ్బేరు టౌన్ అధ్యక్షులు కార్పాకుల వెంకటరమణ యాదవ్, నాయకులు యాపర్ల రామ్ రెడ్డి, పూరు రమణ, దయాకర్ రెడ్డి,ధూపం సర్వేశ్,బోయ సత్తి, జహంగీర్, నరేందర్, వివిధ గ్రామలా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు పెబ్బేరు మున్సిపాలిటీ వార్డ్ అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**భూత్పూర్,జూన్ 24,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన టెన్త్ బోర్డు పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 533మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచిన గొడుగు గౌతమికి పీఆర్‌టీయు టీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా అవార్డులను దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) స్కూల్ టాపర్ గొడుగుగౌతమికి అందజేశారు.ఈ సందర్భంగా గౌతమిని ఎమ్మెల్యే జీఎంఆర్,భూత్పూర్ ఎంఈఓ ఉషారాణిలతో పాటు పీఆర్‌టీయు టీఎస్ భూత్పూర్ మండల అధ్యక్షుడు సత్తూర్ బాల్‌రాజ్‌గౌడ్,పాఠశాల హెచ్‌ఎం ఆనందమ్మలు స్కూల్ టాపర్ గౌతమిని అభినందించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దస్తయ్య, యాదయ్యలు, పాఠశాల ఉపాధ్యాయురాలు రేవతి పాల్గొన్నారు.

## బిజేపి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కార్యక్రమం

**మక్తల్ టౌన్, జూన్ 24 ప్రభాత వార్త:** మక్తల్ పట్టణ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అర్బన్ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర సంక్షేమానికి 11 ఏళ్ల పూర్తి సందర్భంగా పట్టణంలోని ఎఆర్ఎం ఫంక్షన్ హాల్ లో మక్తల్ పట్టణ జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మక్తల్ అర్బన్ మండలం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో బూత్ లెవెల్ నుండి మండల జిల్లా స్థాయి వరకు పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కార్య కర్తలకు పిలుపునిచ్చారు. గత 11 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధిని ప్రజలకు వివరించి వారిని పార్టీ వైపు ఆకర్షితులను చేయాలని అన్నారు. మోడీ ఆధ్వర్యంలో ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సిందూర్ చారిత్రాత్మకమైన అంశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కర్నిస్వామి, సోమశేఖర్ గౌడ్, కల్లూరి నాగప్ప, దేవరింటి నరసింహారెడ్డి,మల్లికార్జున్, బిజెపి అర్బన్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, అర్బన్ మండల ప్రబారి ప్రతాప్‌రెడ్డి, మక్తల్ మండలం మాజీ అధ్యక్షులు లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్ కొండయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శినరేందర్, కురువ లింగం,టప్పాఅశోక్, మాజీ వార్డు సభ్యులు రేణుక నరసింహ, సుకన్య శేఖర్,బుగ్గన,కావలి సత్యనారాయణ, తిరుపతి,వెంకటేష్, సూర్య ఆంజనేయులు, రాజశేఖర్, శివరాములు,విద్యాసాగర్, రాకేష్, బ్యాటరీ రాజు, బిజెవైఎం నాయకులు మహేష్ సాగర్, బీజేవైఎం మండలఅధ్యక్షులు పీకే నరసింహ, నాగరాజు గౌడ్, రాజ గౌడ్, రంకుల ఆంజనేయులు, రాము, ఆంజనేయులు, కృష్ణ ,తాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

**మాగనూర్, జూన్ 24 ప్రభాతవార్త:** బిజెపి పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఉమ్మడి మాగనూర్ మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు నల్లే నర్సప్ప అన్నారు. మంగళవారం మాగనూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మండల కమిటీతో కలిసి కార్యకర్తలతో ముచ్చటించారు. రాబోయే స్థానిక సంస్థల్లో బిజెపి విజయం వైపు పయనించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. కొత్తపల్లి గ్రామం బిజెపి కమిటీ తరపున మండల కమిటీకి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమప్పగౌడ్, లోకపల్లి హనుమంతు,డా. కృష్ణయ్య, సిద్ధప్పగౌడ్, మారెప్ప, అశోక్ కుమార్,భీమప్ప,చంద్రశేఖర్ పాటిల్,ఆనంద్, వెంకటేష్, భాను,శంకర్, రవి పాల్గొన్నారు.

## ఎంపీవో బద్రునాయక్ బదిలీ

**నవాబుపేట, జూన్ 24 ప్రభాతవార్త :** మండల పరిషత్ లో నిన్నటిదాకా విధులు నిర్వహించిన ఎంపీఓ బద్రునాయక్ బదిలీపై కోయిలకొండ మండలానికి బదిలీ అయ్యారు. నవాబుపేట నూతన ఎంపీవోగా నజీర్ అహ్మద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కోయిలకొండ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. మండల పరిషత్ అధికారులు, నజీర్ అహ్మద్‌కు శాలువాతో సిబ్బంది సన్మానించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

## కాలనీలో వెలగని వీధిలైట్లు

**నవాబుపేట,జూన్ 24ప్రభాతవార్త :** గ్రామంలో వీధిలైట్లు వెలగకపోవడం, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలోని రేకుల చౌడపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రాత్రి వేళల్లో వీధిలైట్లు వెలగడం లేదని, ఈ సమస్యను పరిష్కరించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీని కారణంగా రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినప్పటికీ, సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో వెలుతురు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు రాత్రివేళల్లో బయటకు రావాలంటే భయపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామస్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి, వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలి. విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని, వీధిలైట్లను సరిచేయాలి. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు యువకులు అంటున్నారు.

## రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

■ మాజీ జెడ్పిటిసి శ్రీనివాసరెడ్డి

**గండీడ్, జూన్ 24, ప్రభాతవార్త ;** స్థానిక సంస్థల ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పేరిట ఆడుతున్నా డ్రామాలు ప్రజలు గమనిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 19 నెలల కాలంలో రైతులకు హరిగోశపట్టిందని, అందుకుగాను కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని గండీడ్ మాజీ జెడ్పిటిసి మాసారం శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన " ప్రభాతవార్త " తో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎన్నో అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన తర్వాత ఏ పథకం కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేక పోయిందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఎకరాకు15 వేల చొప్పున ఇస్తామని చెప్పి, 12 వేల కి పరిమితం చేయడం మోసం కదా అని ఆయన ప్రశ్నించారు. గత వానకాలం , యాసంగిలో రైతు భరోసాను ఎగ్గొట్టి, స్థానిక సంస్థల ఎన్నికల సమయం సమీపిస్తున్నందున ఓట్ల కోసం ఇప్పుడు రైతులకు రైతు భరోసా ఇస్తూ విజయోత్సవాల పేరిట సంబరాలు జరపడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లోకి వస్తే నాయకులను రైతులు , ప్రజలు నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరపున బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు ఉద్యమించాలని ఆయన కోరారు. ప్రజల్లో కాంగ్రెస్ పై తీవ్ర స్థాయిలో వ్యతిరేకత ఉందని గమనించిన ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో గ్రామాల్లో హడావుడి చేస్తున్నారని, కానీ గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వా న్ని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని ఆయన పేర్కొన్నారు.

## క్షయ వ్యాధిని పారద్రోలేందుకు కట్టుదిట్టమైన చర్యలు

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్,జిల్లా అధికారులు

**వనపర్తి, జూన్ 24 ప్రభాతవార్త:** భూ భారతి చట్టం అమలులో భాగంగ వనపర్తి జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జిల్లా వ్యాప్తంగా 8059 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని వాటిలో ఇప్పటికే ఆరు వేలకు పైగా దరఖాస్తులను ఆన్లైన్ లో నమోదు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లు, ఎరువుల నిల్వలు, ఆయిల్ పామ్ సాగు, భూ భారతి, సీజనల్ వ్యాధుల నిర్మూలన పై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వివరిస్తూ రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్ లో నమోదు చేయడమే కాకుండా నోటీస్‌లు జారీ చేసి దరఖాస్తులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రజలను గుర్తించి వారికి తేమడ పరీక్షలు నిర్వహించడం, మొబైల్ ఎక్స్ రే మిషన్ కొని ఎక్స్ రేలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకుగుర్తించిన 567 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు క్రమం తప్పకుండా వైద్యం, మందులు ఇవ్వడమే కాకుండా వారికి అంత్యోదయ కార్డులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఆర్‌బిఎస్‌కె ద్వారా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు,వర్కర్లకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. టిపిటి పరీక్షలు సైతం చేయిస్తున్నట్లు తెలియజేశారు. వన మహోత్సవంలో భాగంగా ఈ సంవత్సరము వనపర్తి జిల్లాలో 21లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవడం జరిగిందన్నారు. సైట్ గుర్తింపు, గుంతలు తవ్వించే కార్యక్రమం నడుస్తున్నట్లు తెలియజేశారు.జిల్లాలోఆయిల్ పామ్ సాగు పెంచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలలో విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని, తరచుగా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ కార్యక్రమాలు విజయవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు అదనపు కలెక్టర్‌లోకల్ బాడీస్ ఇన్చార్జ్ యాదయ్య ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందా నాయక్, ఉమాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఇంఛార్జ్ ప్రిన్సిపాల్ ఇష్టారాజ్యం?

◆తోటి సిబ్బంది, విద్యార్థుల పట్ల దురుసు ప్రవర్తన ◆వివరణకై వెళ్లిన మీడియాకు అనుమతి లేదంటూ వితండ వాదన..





మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూల్

**దేవరకద్ర, జూన్ 24 ప్రభాతవార్త:** విద్యార్థులకు చదువు చెప్పా ల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థులతో, మహిళ ఉపాధ్యాయులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో అసభ్యంగా ప్రవర్తించాడు. వివరాల్లోకి వెళ్తే దేవరకద్ర మండలంలోని గురుకుల మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ బాలుర 2లో ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహి స్తున్న నాసర్ బిన్ సలాం.కొన్ని రోజులుగా తోటి సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పట్ల అనుసరిస్తున్న వ్యవహార శైలి వివాదాస్పదంగా మారింది. అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో మీరు చదువుకు పనికిరారు, ఎలక్ట్రీషన్, ప్లంబర్, గాలిపంపులు పెట్టుకొని బ్రతకండి అని చెప్పడంతో విద్యార్థులు తీవ్ర మనస్థాపానికి గురై తల్లిదండ్రులతో చెప్పుకొని బాధపడగా, విద్యార్థులు తల్లిదండ్రులు అడిగేందుకు పాఠశాలకు వెళ్లగా, వారితో సైతం దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసింది. ఎమ్మెల్యేకు, పై అధికారులకు ఎవరికి ఫిర్యాదు చేసిన నన్ను ఏం చేయలేరు, నాకు బ్యాగ్రౌండ్ ఉందని తల్లి దండ్రులను బెదిరించగా, వారు సామాజిక మాధ్యమాల వేదికగా ఆఇంచార్జ్ ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఈ విషయంపై వివరణ కోరేందుకు మంగళవారం మీడియా సిబ్బంది పాఠశాల వద్దకు వెళ్లగా,లోపలికి ఎవ రికి అనుమతి లేదని, పాఠశాల లోపలికి వచ్చిన వారిపై కేసులు కూడానమోదు చెయ్యండని, మాపై అధికారులు చెప్పారంటూ మీడియా సిబ్బందితో వాగ్వాదానికిదిగాడు. మీడియా కు అనుమతిని నిరాకరించడంపై డీఎం డబ్ల్యూఓ శంకరా చారిని వివరణ కోరగా అలాంటిదేమీ లేదనిఇప్పటికేఇంచార్జ్ ప్రిన్సిపల్‌పై పలుఫిర్యాదులు వచ్చాయని, జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**తల్లిదండ్రులను వివరణ కోరగా....**

**పిల్లలను హాస్టల్ మాన్పించే విధంగా ప్రవర్తిస్తున్నాడు...**



దేవరకద్ర గురుకుల పాఠశాలలో ఇన్చార్జి ప్రిన్సిపల్‌గా ఉన్న వ్యక్తి పిల్లలను ఇబ్బం దులకు గురిచేసి హాస్టల్ మాన్పించే విధంగా ప్రవర్తిస్తున్నాడు. ఆ ప్రిన్సిపల్ దాడికి మా అబ్బాయిని, మా గ్రామంలో చాలా మంది పిల్లలు కూడా హాస్టల్ మానేశాము. అదేవిధంగా తోటి మహిళా ఉపాధ్యాయులతో అసభ్యంగా మాట్లాడుతున్నాడు.పైఅధికారులు ఇలాంటి కీచక ఉపాధ్యాయుని, విధుల నుంచి సస్పెండ్ చేయాలని కోరుతున్నారు.

మోయిన్ విద్యార్థి తండ్రి, లాల్ కోట గ్రామం.

## అమ్మ పేరుతో ఒక మొక్కను నాటండి

■బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ



మొక్కలను పంపిణీ చేస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ

**వనపర్తి రూరల్, జూన్ 24 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరు అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అన్నారు. భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. శిల్పారెడ్డి పిలుపుమేరకు మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రం కమాన్ చౌరస్తాలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధా ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్కల పంపిణీ కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా జిల్లా కేంద్రంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్కల పంపిణీ ,మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా 550 మొక్కలను కమాన్ చౌరస్తాలో మహిళలను ఆహ్వానించి మొక్కలను పంపిణీ చేయడం జరిగిందని, మొక్కలు తీసుకున్న ప్రతి ఒక్క మహిళ కూడా తమ ఇంటి ముందు వారి అమ్మ ప్రేమకు గుర్తుగా మొక్కలు నాటి ఆ మొక్క పెరిగి పెద్దయ్యే వరకు మన ఇంట్లో చిన్న పిల్లలను సంరక్షించిన మాదిరిగానే సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి. నారాయణ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి,ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బి. శ్రీశైలం, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.అలివేలమ్మ, మహిళా మోర్చాజిల్లా అధ్యక్షురాలు అశ్విని రాధ, కార్యక్రమ జిల్లా కన్వీనర్ జిల్లా ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి ఉపాధ్యక్షులు సుమిత్రమ్మ, పెద్దిరాజు, కొమ్ము శ్రీనివాసులు పాల్గొన్నారు.

## కాలపరిమితి మెడిసిన్ అమ్మితే కఠినమైన చర్యలు

■ఎక్స్పైరీ డేట్ మెడిసిన్‌కు ఒక బాక్స్ ఏర్పాటు చేయాలి

■వనపర్తి జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ రష్మి



మెడికల్ షాప్‌ను తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్స్పెక్టర్ రష్మి

**పెబ్బేరు, జూన్ 24 ప్రభాతవార్త:** పెబ్బేర్ పట్టణంలో ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో గర్భిణీ పేషంటు కాలం చెల్లిన మందులను విక్రయించారని ఒక బాధితుడు ఆందోళన చేసిన విషయమై మంగళవారం రాఘవేంద్ర హాస్పిటల్ ను వనపర్తి జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ రష్మి తనిఖీ చేశారు. అక్కడున్న మెడికల్ షాపులో అన్ని మందులను చెక్ చేసి గర్భిణీకి ఫుడ్ సప్లిమెంట్ కోసం ఇచ్చిన టాబ్లెట్స్ ఎక్స్పైర్ అయినవే అని నిర్ధారణ చేశారు. అది కూడా పొరపాటున చూసుకోకుండా వాటిని విక్రయించారని హాస్పిటల్ నిర్వాహకులు ఒప్పుకున్నారని డ్రగ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. సాధారణంగా ఎక్స్పైర్ అయిన మందులను కోసం బాక్స్ ఏర్పాటు చేసి దానిలో ఉంచాలని నిబంధనను వీరు పాటిస్తున్నారని చెప్పారు. ఈ హాస్పిటల్ వారు ఇచ్చిన మెడిసిన్ అంతా ప్రమాదకరమైనదేమి కాదని చెప్పారు.మెడికల్ షాప్‌లో తనిఖీ చేసిన వివరాలన్నిటిని మహబూబ్‌నగర్ డ్రగ్స్ యూనిట్ ఆన్లైన్లో నివేదించినట్లు తెలియజేశారు. ఈ హాస్పిట ల్‌లో ఉన్న మెడికల్ షాప్‌ను వారం రోజుల పాటు మూసివేస్తున్నట్లు వారం రోజుల వరకు షాపును తెరవరాదని ఎలాంటి లావాదేవీలు జరుపకూడదని హెచ్చరించారు. ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే మెడికల్ షాపుపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దేశంలో రైతులను ఆదుకున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం



**ఇటిక్యాల, జూన్ 24 ప్రభాతవార్త:** దేశంలో అన్ని రకాలుగా రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని రైతులకు పెట్టుబడి సాయంగా ఖరీఫ్ సీజన్‌లో తొమ్మిది రోజులలో 9 వేల కోట్ల రూపాయలను 70 లక్షల మంది రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని ఇది చరిత్ర అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు వివరించారు. రైతులకు పంట పెట్టుబడి సాయంగా ప్రభుత్వం 9 రోజులలోనే 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలలో నేరుగా జమ చేయడంతో మంగళవారం సాయంత్రం ప్రభుత్వం రైతు సంబరాలను నిర్వహిస్తూ ముఖ్యమంత్రి ప్రసంగిస్తుండగా మండల పరిధిలోని ఇటిక్యాల, కోదండపురం, చాగాపురం, ధర్మవరం, వేముల గ్రామాలలో ఆ గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించేందుకుగాను కార్యక్రమం ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి రైతు వేదికలలో రైతులు పాల్గొనగా పుటాన్ దొడ్డి రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి రవికుమార్ ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు. అలాగే ఈ రైతు వేదికలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుసంబరాలలో భాగంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలోనే రైతును అన్ని రకాలుగా ఆదుకుంటూ 20 వేల 600 కోట్ల రూపాయలతో రైతులకు 2 లక్షల రుణమాఫీ. 70 లక్షల రైతులకు 9000కోట్ల రూపాయలతో రైతు భరోసా నిధులు జమ చేయడం, రైతులకు వరికి 500 రూపాయల బోనస్, ఉచిత కరెంటు వంటివి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం జరుగుతుందన్నారు. దేశంలో ఏ కాలంలో 2 లక్షల రుణమాఫీ చేయడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ ప్రభుత్వంలో రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అలాగే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ యువతకు స్వయం ఉపాధిని కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం ద్వారా ఆదుకోవడం జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు యువతకు స్పష్టం చేశారు.

## బిజెపి బంద్ విజయవంతం

**నారాయణపేట టౌన్, జూన్ 24 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలో ఏరియా ఆసుపత్రిని వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం బిజెపి పార్టీ నారాయణపేట బందుకు పిలుపునిచ్చింది. పిలుపులో భాగంగా వ్యాపార, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బందును పాటించారు. అంతకుముందు బిజెపి జిల్లా నాయకుల ఆధ్వర్యంలో పట్టా అన్న పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ నారాయణపేట పట్టణానికి ఏరియా ఆసుపత్రి తీసుకురావడం పట్ల నిర్లక్ష్య చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్ప ఉన్నారు. ఏరియా ఆసుపత్రిని పట్టణంలో ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. స్వచ్ఛందంగా బందుకు మద్దతు పలికిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా, పట్టణ నాయకులతో పాటు తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముగ్గు పోసిన పంచాయతీ కార్యదర్శి

**నారాయణపేట టౌన్, జూన్ 24 ప్రభాతవార్త :** నారాయణపేట మండలం బొమ్మన్‌పాడు గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ కార్యదర్శి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ముగ్గు వేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పనులను వేగవంతంగా కొనసాగించాలన్నారు. పనులు చేపట్టిన లబ్ధిదారులకు దశల వారీగా బిల్లులు అందజేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పల్లె రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ కనకప్పతో బాటు తదితరులు ఉన్నారు.

## సుద్దబండ తండాకు కొత్తగా ఆర్టీసీ బస్సు సర్వీస్

**దామరగిద్ద, జూన్ 24 ప్రభాతవార్త :** దామరిగిద్ద మండలంలోని సుద్ద బండ తండాకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు కొత్తగా ఆర్టిసి బస్సు సర్వీస్ ను మొదలుపెట్టారు. బస్సు మొదలు కావడంతో ప్రయాణికులకు రాకపోకలు సులువుగా మారనున్నాయి.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎమ్మెల్యే చిట్టెంపర్ణిక రెడ్డికి,నారాయణపేట మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## స్థానిక ఎన్నికలు కచ్చితంగా నిర్వహించేందుకు చర్యలు

**ఆత్మకూర్ జూన్ 24, ప్రభాతవార్త;** రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు పటిష్టంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆత్మకూర్ సిఐ శివకుమార్ వెల్లడించారు. స్థానిక ఎన్నికలను పటిష్టంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో ఆత్మకూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ భద్రతా దళాలు కవాతు నిర్వహించాయి. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహిస్తూ ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వచ్ఛందంగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని సిఐ సూచించారు. శాంతి భద్రతలు కాపాడే విషయంలో పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగానే ఆత్మకూర్ సర్కిల్ పరిధిలోని ప్రధాన పట్టణాలలో పోలీస్ కవాతు నిర్వహిస్తున్నట్లుగా ఆయన వెల్లడించారు. ఆత్మకూరు ఎస్సై నరేందర్, పోలీసు సిబ్బంది, భద్రతా దళాలు పాల్గొన్నారు.

## పోరాటాల స్ఫూర్తి: ఏఐఐఈఏ

**కల్వకుర్తి, జూన్ 24 ప్రభాతవార్త:** భారతీయ జీవిత బీమా ఎల్.ఐ.సి. ఉద్యోగుల సంఘం ఏఐఐఈఏ కల్వకుర్తి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం భోజన విరామ సమయంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు హుసేన్ పాష మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పోరాటాల ద్వారానే సాధ్యమన్నారు. ఇందుకు ఏఐఐఈఏ ఒక ఉదాహరణని అన్నారు. ఎన్నో విజయాలను ఏఐఐఈఏ ఉద్యమాల ద్వారానే సాధించుకున్నదని చెప్పారు. ఇంకా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, ఉద్యోగాల నియామకం, అందరికి పాత పెన్షన్, పాలసీలపై జీఎస్టీ తొలగింపు మరియు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలు ప్రైవేటీకరణ ఎఫ్డీఐలకు వ్యతిరేకంగా జూలై 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఏఐఐఈఏ కూడా పాల్గొంటున్నదని తెలిపారు. అందులో తీసుకున్న నిర్ణయ ప్రకారం మంగళవారం నిరసన చేసినట్లు తెలిపారు. ఏఐఐఈఏ 75 వసంతాల ఉత్సవాలను ప్లాటినం జూబ్లీ సెలబ్రేషన్స్ జరుపుకుంటున్న సందర్భంగా ఏజెంట్లకు నూతన వ్యాపార కాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అభిషేక్, సౌమ్య,కృష్ణారెడ్డి, శ్రీధర్,శ్రీకర్,నాగేష్, ప్రతాప్,అనురాగ్, ప్రవీణ్, నిరంజనమ్మ, లక్ష్మి, ఖాజా, రవూఫ్, శేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

## అడవి పందుల బొలెరో పట్టివేత

■పలువురుపై కేసు నమోదు

**నారాయణపేట ప్రతినిధి, జూన్ 24 ప్రభాతవార్త:** పట్టణ పరిధిలోని జలాల్ పూర్ చెక్ పోస్ట్ వద్ద సోమవారం సాయంత్రం కర్ణాటకకు చెందిన బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో నాలుగు అడవి పందులను చూసి పట్టుకోవడం జరిగింది. ఇట్టి వాటిని దేవ దుర్గా తాలూకా భూమన కొండకు చెందిన 11 మంది వేట కుక్కల సహాయంతో యానగుంది మరియు దామరగిద్ద పరిసర ప్రాంతాల్లో వేటాడి వాటిని దేవాదులకు తరలిస్తుండగా నారాయణపేట పోలీస్ సిబ్బంది పట్టుకోవడం జరిగింది. వేట కుక్కలు కరవడం వల్ల నాలుగు అడవి పందులు చనిపోయినాయి. బొలెరోను పందులను స్వాధీనం చేసుకొని వాటిని వేటాడి తీసుకెళ్తున్న బొలెరో డ్రైవర్ అప్పన్నతో పాటు ఎల్లప్ప అనే వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. మిగతా వ్యక్తులు పోలీసు వారిని చూసివేట కుక్కలతో సహ పారిపోయినట్టు తెలి పారు. దేవ దుర్గా తాలూకా భూమన కొండకు చెందిన 12 మంది పైన కేసు నమోదు చేసి బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకొని అడవి పందులను వెటర్నరీ డా.ద్వారా పోస్టుమార్టం నిర్వహిం చడం జరిగిందని నారాయణపేట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## బడిబాట కార్యక్రమానికి అపూర్వ స్పందన

**కృష్ణ, జూన్24 ప్రభాతవార్త :** ఆలంపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం ద్వారా అపూర్వ స్పందన లభించిందని మండల విద్యాధికారి నిజాముద్దీన్ అన్నారు. అందులో భాగంగా వివిధ ప్రైవేట్ పాఠశాలల నుండి దాదాపు 15 మంది విద్యార్థులు, అలాగే గ్రామంలోని మిగతా విద్యార్థులు కలిపి 30 మంది విద్యార్థుల వరకు నూతనంగా పాఠశాలలో చేరారన్నారు. దీంతో మొత్తం 100 మంది విద్యార్థులకు పెరిగారని అన్నారు. ఈరోజు పాఠశాల తనిఖీలో భాగంగా మండల విద్యాధికారి నిజాముద్దీన్‌కు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, లక్ష్మి గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి పాఠశాలలో ఇద్దరే ఉపాధ్యాయులు ఉండడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని, అదనంగా ఇంకొక ఉపాధ్యాయున్ని నియమించాలని వినతి పత్రం అందించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మండల విద్యాధికారి ఈ అంశాన్ని జిల్లా అధికారులకు తెలియపరచి, సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవితేజ, ఉపాధ్యాయులు అనిల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి, గ్రామస్తులు మాజీ సర్పంచ్ రామకృష్ణదని,గౌరప్ప, డీలర్ శివరాజ్,మారెప్ప, సురేష్ గౌడ్, రాజు ఇతరులు పాల్గొన్నారు.

